క్లుప్తంగా

నోట్ల అలంకరణలో అమ్మవారు



మద్దిలపాలెం : ఏపీ ఎస్‌సీబీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధారలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల్లో మంగళవారం దుర్గాదేవికి నోట్ల అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సింహాద్రి రాజు, అధ్యక్షుడు కె.రామారావు, సుజని, జయప్రద, నాగేంద్ర కుమారి పాల్గొన్నారు.

ప్రేమసదన్‌లో వైభవంగా దసరా ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న సత్యసాయి భక్తులు

ఎంవీపీ కాలనీ : శ్రీ సత్యసాయి ప్రేమ సదన్‌లో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర అర్చన, సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో భక్తులు, సత్యసాయి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాలువ గట్టు పైకి ఎక్కి ఉండిపోయిన కారు

భీమునిపట్నం: భీమిలి–తగరపువలస రోడ్డు కాలువపై ఉన్న కల్వర్టు గట్టుపైకి ఒక కారు ప్రమాదవశాత్తు ఎక్కింది. అయితే, కారు గట్టుపైనే ఉండిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. వివరాలివి.. ఇక్కడ జమ్మిచెరువు పార్కు సమీపంలో ప్రధాన మురుగునీటి కాలువపై కల్వర్టు గట్టు ఉంది. అయితే, ఎప్పుడు జరిగిందో.. ఒక కారు రివర్స్ చేస్తున్న క్రమంలో వేగంగా వెనక్కి వెళ్తూ గట్టును బలంగా ఢీకొట్టినట్టు తెలుస్తోంది. దీంతో వెనుక కుడివైపు చక్రం ఊడిపోయింది, కానీ అదృష్టవశాత్తు కారు కాలువలో పడకుండా గట్టుమీదే ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈకారు ఎవరిది, ఎక్కడివారు అన్న వివరాలు తెలియలేదు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: దసరా ఉత్సవాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని సరస్వతీ నృత్య కళా మందిర్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారి కళాకారులు తమ నృత్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కె.సరస్వతి నృత్య దర్శకత్వంలో చిన్నారులు చక్కని ప్రతిభను కనబరిచారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాయినాథుని సన్నిధిలో దీపకాంతులు



- చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మూడు దశాబ్దాలుగా దసరా రోజున దీపారాధన
- సామూహికంగా 18 వేల దీపాలు వెలిగిస్తున్న భక్తులు
- ఆలయంలో కొట్టిన కొబ్బరి ముక్కల నూనెతోనే దీపారాధన



సాయినాథుని సన్నిధిలో భక్తులు వెలిగించిన దీపాలు

ఆరిలోవ : దసరా సమీపిస్తుండడంతో చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ప్రత్యేక దీపారాధనకు సిద్ధమవుతోంది. వేల దీపాల కాంతుల్లో వెలిగిపోనుంది. ఆలయంలో 31 సంవత్సరాల నుంచి సామూహిక దీపారాధన చేస్తున్నారు. అన్ని ప్రాంతాల భక్తులు దీపాలు వెలిగించి తరిస్తున్నారు. ఇక్కడి ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు ప్రస్తుతం దుర్గాదేవి నవరాత్రులు వైభవంగా జరుపుతున్నారు. ఈ ఆలయ ప్రాంగణంలో పోలమ్మ అమ్మవారి గుడి ప్రత్యేకంగా ఉంది. ఈ గుడిలో అమ్మవారికి నిత్యం పూజలు, హోమాలు జరుపుతుంటారు. ప్రస్తుతం అమ్మవారికి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విశేష పూజలు జరుపుతున్నారు. అక్టోబరు 2న విజయదశమి రోజుల దీపారాధన కోసం ఆలయ ట్రస్ట్ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీపారాధన కోసం ప్రమిదలు, అరటి చెట్లు, నూనె సిద్ధం చేస్తున్నారు.

18 వేల దీపాలతో దివ్య కాంతులు

చినగదిలిలో 1995లో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ఏటా విజయదశమి రోజున సామూహిక దీపారాధన జరుపుతున్నారు. భక్తులందరితో 18 వేల దీపాలు వెలిగిస్తున్నారు. ప్రస్తుతం అక్టోబర్ 2న విజయదశమి రోజున 31వ సామూహిక దీపారాధనకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా విజయదశమి రోజున సాయంత్రం 18 వేల మట్టి ప్రమిదలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేస్తారు. ఆ ప్రమిదల్లో కొబ్బరి నూనె మాత్రమే వినియోగించి దీపాలు వెలిగిస్తారు. షిర్డీ సాయిబాబాను కొలిచే భక్తులు ఏడాదంతా ఆలయంలో కొట్టిన కొబ్బరి కాయల నుంచి వచ్చిన నూనెను మాత్రమే ఈ సామూహిక దీపారాధనలో వినియోగించడం విశేషం.

భక్తులు సొంతంగా తీసుకెళ్లే నూనెను ఇక్కడ అనుమతించరు. ఆలయంలో విడివిడిగా ప్రమిదలు ఏర్పాటు చేయడంతోపాటు అరటి చెట్లు, ఇనుప ఊచలతో తయారు చేసిన స్టాండ్లపై 11, 18, 27 తదితర సంఖ్యలలో ప్రమిదలు అమర్చుతారు. వాటిలో విజయదసమి రోజున కొందరు కుటుంబాలతో వెళ్లి సామూహికంగా దీపాలు వెలిగిస్తుంటారు. ఆలయ ట్రస్టు నిర్వాహకులే కొబ్బరి నూనెతోపాటు ప్రమిదలు సిద్ధం చేస్తారు. వాటిలో దూదితో చేసిన ఒత్తులు ఏర్పాటు చేస్తారు. విజయదశమి రోజున ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి, అడవివరం, డెయిరీఫారం, హనుమంతవాక, విశాలాక్షినగర్‌తోపాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకుంటారు. దీంతో ఈ ప్రాంతంలో విజయదశమి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. గురువారం విజయదశమి రోజున దీపారాధనకు ఆలయం సిద్ధమవుతోంది.



దసరా దీపారాధనకు ముస్తాబవుతున్న చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం

2008 నుంచి భక్తులకు నిత్యాన్నదానం



ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఈ ఆలయ ప్రాంగణంలో షిర్డీ సాయినాథుడితో పాటు పోలమాంబ గుడి, ఆంజనేయ స్వామి, గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి, రమా సత్యనారాయణ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, అభయ గణపతి, అయ్యప్పస్వామి, అంబికా సహిత అమృతమృత్యుంజయ స్వామి ఆలయాల సముదాయం ఉంది. ఆయా ఆలయాల్లో దేవతలకు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యాన్నదానం ప్రత్యేకత సంతరించుకుంది. ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 2008 నుంచి అన్నదానం నిరాటంకంగా కొనసాగుతోంది. రోజూ సుమారు 100 నుంచి 150 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఏటా సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణ భక్తుల కోసం మధ్యాహ్నం, రాత్రి అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు.

దీపారాధనలో భక్తులందరికీ అవకాశం



ఆలయంలో విజయ దశమి రోజున సామూహిక దీపారాధన మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నాం. 1995లో ఆలయం నిర్మించనప్పటి నుంచి 18 వేల దీపాలు వెలిగిస్తున్నాం. భక్తులందరికీ దీపాలు వెలిగించే అవకాశం కల్పిస్తున్నాం. సాయినాథుని ఆశీస్సులతో ఏటా విజయవంతంగా నిర్వహిస్తున్నాం. నగరంలోని చాలా ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. దీపారాధనతోపాటు శ్రీరామ నవమి, ఉగాది, పోలమాంబ పండగ, గిరి ప్రదక్షిణ భక్తులకు అన్నసమారాధన, గురు పౌర్ణమి పూజలు, ముక్కోటి ఏకాదశి వైభవంగా నిర్వహిస్తున్నాం. భక్తులు, దాతల సహకారం మరువలేనిది.

– వానపల్లి అప్పారావు, ఆలయ ఛైర్మన్ ట్రస్టీ

ఎంవీపీ రైతుబజార్‌కు సెలవు రద్దు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ రైతు బజార్‌కు బుధవారం సెలవు రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా మార్కెటింగ్ శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. దసరా పండగను పురస్కరించుకుని వినియోగదారుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వినియోగదారులకు దసరా పూజా సామగ్రితోపాట కూరగాయాలు, పండ్లు, పువ్వులు, కొబ్బరికాయలు, అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఇస్కాన్‌లో రావణదహనం రేపు

కొమ్మాది: దసరా వేడుకల్లో భాగంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం రాత్రి 7 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రకటనలో తెలిపారు. 50 అడుగుల రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్స్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు ఉంటాయని తెలియజేశారు. ఆ రోజు ముందుగా మందిరంలో రాధాకృష్ణులను, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు.

స్కూటీ దగ్ధం



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో దగ్ధమైన స్కూటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో క్వార్టర్ ముందు పార్క్ చేసిన బైక్ దగ్ధమైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–5లోని 505 డి క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ పి. సుందరరావు నివాసముంటున్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ముందు స్కూటీ పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కింద క్వార్టర్‌కు చెందిన వ్యక్తి స్కూటీ కాలిపోవడం గమనించి సుందరరావుకు సమాచారం ఇచ్చారు. వారు ఫైర్ విభాగానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా కాలిపోయింది.

బల్క్‌డ్రగ్స్ బాధితులకు వైఎస్సార్‌సీపీ సంఘీభావం



రాజయ్యపేటలో మత్స్యకారుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న విజయచందర్, కల్యాణ్ తదితరులు

ఎంవీపీ కాలనీ : నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట బల్క్‌డ్రగ్స్ ఫార్మా బాధితులకు జీవీఎంసీ 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కొంతకాలంగా బల్క్ డ్రగ్స్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ పాయకరావుపేట నియోజకవర్గంలోని మత్స్యకారులు నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 18వ వార్డుకు చెందిన మత్స్యకార నాయకులు మంగళవారం రాజయ్యపేట మత్స్యకారుల దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు ఏపీ మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయ చందర్, వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్, పలువురు అప్పుఘర్ గ్రామ మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ మండపాల వద్ద అన్నసమారాధనలు



అమ్మవారి సన్నిధిలో మొల్లి అప్పారావు, మువ్వల లక్ష్మి, సురేష్ తదితరులు



పెదవాల్తేర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరు మునిసిబ్ వారి వీధిలో శ్రీ మహిళ అసోసియేషన్, గుడ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై అన్నప్రసాదం పంపిణీ చేశారు. వారు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, దువ్వి గోవింద్, బుద్దల పెంటరావు, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.

పెదవాల్తేర్ ఆటోస్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో...

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేర్ ఆటోస్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, సీపపు గణేష్ రెడ్డి, దుంప రవి, ఉమామహేశ్వరరావు, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించనివ్వం



పోర్టు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 365 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదని, పోర్టు యాజమాన్యం వద్ద ఉన్న సొంత నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగర అభివృద్ధికి పోర్టు ఎంతో కీలకమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐద్వా నాయకురాలు సుమిత్ర, రైతు సంఘం నాయకుడు నాయన బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ,జె.సత్యనారాయణ, గణేష్, శంకర్రావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

విజయ దుర్గాదేవి నమోస్తుతే..



విజయ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



ఎర్నిమాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



శ్రీ చండికాదేవికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు



శ్రీచండికాదేవి ఆలయంలో సుందరకాండ పారాయణ చేస్తున్న భక్తులు

ఆరిలోవ : దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆరిలోవ ప్రాంతంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం వివిధ ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. పన్నెండో వార్డ్ పరిధి తోటగరువు ఎర్నిదుర్గామాంబ ఆలయంలో మురళీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకుల పర్యవేక్షణలో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

- జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలో విజయ దుర్గాదేవి ఆలయంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం అమ్మవారిని విజయదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ఆవరణలో సామూహిక లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీ చండికాదేవికి ప్రత్యేక పూజలు..

ఎంవీపీ కాలనీ : దుర్గాష్టమిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని శ్రీ చండికాదేవికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళ భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీలలితా సహస్రనామ కుంకుమార్చన, సుందరకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహనరావు, వెంకటరావు, టీఎస్ మూర్తి, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4న మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవాలు ఈ నెల 4న నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజుకు ఆహ్వాన పత్రిక అందించి, ఆయన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కళాభిమానులు, సంగీతప్రియులు, సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొని మెలోడి క్రియేటర్స్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక వైభవం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, నటరత్న, యువరత్న పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, వి.ప్రభాకర్, మేడా మస్తాన్‌రెడ్డి, అరుణకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అప్పన్న చిత్రపటాల అందజేత



గిరిజనులకు అప్పన్న చిత్రపటాలు అందజేస్తున్న సురేంద్రస్వామి

సింహాచలం: అల్లూరి సీతారామరాజుజిల్లా ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీలోని తమ్మెగుల, ఆమ్లకూడ, శరబంద గుర్రాబయలు గ్రామాల్లో సింహాచలంకు చెందిన సింహాద్రిమఠం ఆధ్వర్యంలో మంగళవారం హిందు ధర్మ ప్రచారం చేశారు. సింహాద్రి మఠం నిర్వాహకుడు, శ్రీనృసింహ దీక్ష గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి హిందు ధర్మ విశిష్టతను గిరిజనులకు తెలియజేశారు. శ్రీనృసింహ దీక్ష విశిష్టతని చాటిచెప్పారు. 128 గిరిజన కుటుంబాలకు శ్రీనృసింహస్వామి చిత్రపటాలు, తువ్వాళ్లు అందజేశారు.